క్లుప్తంగా

కడపకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు

కావలి: కావలి నుంచి కడపకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు శనివారం తెలిపారు. గతంలో కావలి నుంచి కడపకు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసును ఇటీవల సరైన ఆదాయం రాకపోవడంతో రద్దు చేయడం జరిగిందన్నారు. అయితే ఉద్యోగులు, వ్యాపారుల విజ్ఞప్తి మేరకు తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. కావలిలో ఉదయం 6.45 గంటలకు బయలుదేరి కడపకు 11.50 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు కడపలో బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు కావలికి చేరుకుంటుందని వివరించారు. ప్రయాణీకులు ఆదరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటికి నివాళి



కావలి: కావలి మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. గొట్టిపాటి సేవలను శ్లాఘించారు. నివాళులర్పించిన వారిలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, సోమశిల ప్రాజెక్టు మాజీ చైర్మన్ కే మధుబాబు నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ఉన్నారు.

వింజమూరువాసికి డాక్టరేట్



వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని పాతూరుకు చెందిన విశ్రాంత ఆధ్యాపకుడు గడ్డం రమణయ్య కుమారుడు అంజనీ కుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఆయన ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎస్వీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈఈఈ విభాగం ప్రొఫెసర్ ఎం దామోదరరెడ్డి పర్యవేక్షణలో 'పీవీ ఇంటిగ్రేటెడ్ ఎస్‌ఏపీఎఫ్ ఫర్ హార్మోనిక్ రిడక్షన్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ యూజింగ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై పరిశోధనలు చేసి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయనను మిత్రులు, బంధువులు, సహచర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని బీసీకాలనీలో ఎమ్మెల్యే నిధులు రూ.20 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఏఈ తిరుమలయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి

సీతారామపురం : మండలంలోని ఓగూరువాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓగూరు ప్రవీణ్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ప్రవీణ్ మృతదేహాన్ని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యూత్ జనరల్ సెకటరీ చప్పిడి తిరుపతిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. జీవనోపాధి కోసం బెంగుళూరు వెళ్లి అనారోగ్యానికి గురై ప్రవీణ్ మృతి చెందడం విచారకరమని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు సోడా జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

• ముగ్గురికి గాయాలు



ఆత్మకూరు: బైక్‌ను కారు ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహ్మద్‌రఫీ తన ఇద్దరు కుమారులను పాఠశాలలో వదిలేందుకు బైక్‌పై తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో మున్సిపల్ బస్టాండ్ వద్ద వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి, పిల్లలు గాయాలపాలయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందజేసి క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు.

భారీ జాతీయ పతాకంతో ర్యాలీ

కలిగిరి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కలిగిరిలో ఈస్టుఉడ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు శనివారం భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. కలిగిరమ్మ ఆలయం వద్ద మానవహారం చేపట్టారు. కరస్పాండెంట్ మధుబాబు, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

• ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత
• పొగాకు బ్యారెన్లు, ఇటుక, బొగ్గు బట్టీలకు తరలింపు
• సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
• చోద్యం చూస్తున్న అధికారులు



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న కలప

సీతారామపురం: జీవకోటి మనుగడకు కీలకమైన చెట్లను ఇష్టారాజ్యంగా నరికేస్తున్నారు. కొందరు అక్రమార్కులు పచ్చదనాన్ని నాశనం చేస్తూ కలపను అక్రమంగా తరలిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఎలక్ట్రికల్ రంపాలతో పెద్ద పెద్ద చెట్లను సైతం నేల కూలుస్తున్నారు. అనంతరం వాటిని చిన్న చిన్న మొద్దులుగా మార్చి ఇటుక, బొగ్గు బట్టీలు, పొగాకు బ్యారెన్లకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, చెరువు కట్టలు, సమీప అటవీ ప్రాంతాల్లోని చెట్లను అక్రమంగా నరికేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

అమలుకాని నిబంధనలు

అటవీశాఖ నిబంధనల ప్రకారం రైతులు తమ పొలాల్లోని చెట్లను నరికి తరలించాలంటే అటవీ శాఖ అధికారులకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలి. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి నిబంధనలు మండలంలో ఎక్కడా అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. టన్ను కలప ధర రూ.6 వేల వరకు పలుకుతుండటంతో అక్రమార్కులు పగలు, రాత్రి అనే తేడాలేకుండా కలపను యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పొగాకు బ్యారెన్లకు వినియోగించే చిల్లకర్ర ధరలు కూడా ఆకాశానికి ఎగబాకుతున్నాయి. రైతులు పొగాకు సాగుచేసిన నాటి నుంచే కర్రను కొనుగోలు చేస్తుంటారు. దీంతో అక్రమార్కులు గ్రామాల్లోని పొలాలు, బీడు భూములు, కాలువలు, చెరువుకట్టలు, ఏటి గట్లపై ఉండే చిల్లకర్రను కొట్టి విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ట్రక్కు కలప రూ.45 వేల వరకు పలుకుతోంది. దీంతో ఎక్కడ కర్ర ఉన్నా అక్రమార్కులు కూలీలతో కొట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలప అక్రమ రవాణాపై నిఘా ఉంచి కట్టడికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు గురుకుల విద్యార్థుల పరారు

• ఇద్దరిని పట్టుకున్న ఉపాధ్యాయులు
• కనిపించని మరో విద్యార్థి
• పోలీసులకు ప్రిన్సిపల్ ఫిర్యాదు



పరారీలో ఉన్న విద్యార్థి వెంకటేశ్వర్లు

ఉదయగిరి: గండిపాళెంలోని గురుకుల విద్యాలయం నుంచి శనివారం మధ్యాహ్నం ముగ్గురు విద్యార్థులు పరారయ్యారు. అందులో ఇద్దరిని సాయంత్రం పట్టుకున్నారు. మరో విద్యార్థి ఆచూకీ తెలియకపోవడంతో ప్రిన్సిపల్ పుష్పరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు..గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న వెంకటేశ్వర్లు, హర్ష, ప్రణయ్ మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాత తరగతులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో స్టడీ అవర్‌లో ముగ్గురు విద్యార్థులు లేని విషయాన్ని ఉపాధ్యాయుడు గుర్తించారు. వసతి గృహంలోకి వెళ్లి చూడగా వారి బ్యాగులు కూడా కనిపించలేదు. దీంతో ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో సాయంత్రం ఓ ఉపాధ్యాయుడు విధులు ముగించుకుని ఉదయగిరిలోని ఇంటికి వెళుతుండగా వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి వద్ద ఇద్దరు విద్యార్థులు కనిపించగా పాఠశాలకు తీసుకెళ్లారు. పరారీలో ఉన్న వెంకటేశ్వర్లు గురించి విచారించగా తమకు తెలియదని సమాధానం చెప్పారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న విద్యార్థిది అనంతసాగరం మండలం గుడిగుంట గ్రామమని, రాత్రి వరకు ఇంటికి చేరలేదని ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న విద్యార్థిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల పరారీకి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

శ్మశానానికి దారి చూపాలని ఆందోళన



సీతారామపురం : శ్మశానవాటికకు దారి చూపాలని కోరుతూ సీతారామపురం గ్రామస్తులు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 529– 2లోని శ్మశాన వాటికకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని తెలిపారు. దీంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి దారి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అంధకారంలో ప్రభుత్వాస్పత్రి



ఆస్పత్రి రోడ్డులో దీపాలు వెలగక అలుముకున్న చీకట్లు

అల్లూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చీకటి పడితే అంధకారం నెలకొంటోంది. ఆస్పత్రి ప్రాంగణంలోని దీపాలు కొద్దిరోజులుగా వెలగడం లేదు. మెయిన్‌గేటు నుంచి ఆస్పత్రి భవనం వరకు దారి మొత్తం చీకట్లు పరుచుకుని ఉంటోంది. ఆస్పత్రిలో 24 గంటలు వైద్య సేవలు అందిస్తుండడంతో రాత్రి వేళల్లోనూ రోగులు వస్తుంటారు. అలాగే ఆస్పత్రిలో డెలివరీలు సైతం చేస్తుంటారు. గర్భిణులతో పాటు వచ్చిన బంధువులు రాత్రి వేళల్లో అవసరమైన వాటి కోసం బయటకు వస్తుంటారు. మెయిన్ గేట్ నుంచి ఆస్పత్రి భవనం వరకు దారి పొడవునా చీకట్లు అలుముకుని ఉండడంతో రాకపోకలు సాగించేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ నిరసన

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శనివారం ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. డీఎం కరీమున్నీసా తమ యూనియన్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడాన్ని నిరసిస్తూ ఎర్రబ్యాడ్జీలు ధరించి ప్రదర్శన చేపడుతున్నామని ఈయూ డిపో సెక్రటరీ మేకపాటి చిన్నారెడ్డి, గ్యారేజీ సెక్రటరీ మల్లికార్జున తెలిపారు. యూనియన్ జాయింట్ సెక్రటరీలు ఏపీరెడ్డి, తిరుమలరెడ్డి, బీకే హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పశుఆరోగ్య శిబిరం

సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి పంచాయతీలో పశుఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది సుమారు 89 పశువులకు పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ గాజులపల్లి భారతిరెడ్డి చేతుల మీదుగా పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ జీ గంగాధర్

ఆత్మకూరు: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని ఎస్ఎస్ఎస్ యూత్ క్లబ్‌కు క్రెడ్ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం సహకారంతో క్రీడా పరికరాలను శనివారం రాత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత చెడు మార్గాలు పట్టకుండా స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి క్రీడల్లో ప్రావీణ్యం సాధించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలను పొందవచ్చని తెలిపారు. క్రెడ్ సంస్థ నిర్వాహకుడు వాగాల శ్రీహరి, కమిటీ సభ్యులు టీ కోనయ్య, యూత్ క్లబ్ సభ్యులు సుధాకర్, బాబు, మనోజ్, వెంకటేశ్వర్లు, సునీల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



అనుమసముద్రంపేట: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంఈఓ సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని ఉల్లాస్ వలంటీర్లకు ఏపీఎం సతీష్ ఆధ్వర్యంలో ఎంఈఓ చేతుల మీదుగా శనివారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వలంటీర్లు గ్రామాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాలను నేర్పించాలని సూచించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

• ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని



ఆత్మకూరులో ఓటరు దినోత్సవ ర్యాలీలో ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని పిలుపునిచ్చారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, తహసీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద ర్యాలీని ఉద్దేశించి ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విశిష్టతను వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, వీఆర్‌ఓలు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఏఎస్ఓ కిషోర్ ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఆర్ఐ సాయికిరణ్, బీఎల్వోలు సుప్రజమేరీ, అహ్మద్, వీఏఏ లక్ష్మిలహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు.

సోమశిల: అనంతసాగరం మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దార్ వై సుభాషిణి ఆధ్వర్యంలో ఓటర్లకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు.

చేజర్ల: మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు తహసీల్దార్ బీ మురళి ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు.

సంగం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అలాగే వెంగారెడ్డిపాళెంలో సీనియర్ ఓటర్లను సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు.

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. అలాగే మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ సుభద్ర, ప్రిన్సిపాల్స్ నారాయణస్వామి, గోపికృష్ణ, వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహులు, ఆర్ఐ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

• వింజమూరులోని పాతబస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు డిప్యూటీ తహసీల్దార్ చేవూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

సీతారామపురం : మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఓటు హక్కు విశిష్టతపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ ఓటరు ఖాసీంసాహెబ్‌ను సత్కరించారు.

దుత్తలూరు: మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి దుత్తలూరు సెంటర్ వరకు తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. దుత్తలూరులోని పోలింగ్ కేంద్రంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఎస్సై పీ ఆదిలక్ష్మి, ఎంఈఓ వెంగయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో బీఎల్వో శాంతకుమారి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు.

అల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ సెంటర్ వరకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్ రవిజోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కప్పరాళ్లతిప్ప కూడలి వరకు తహసీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ భరత్‌కుమార్, మండల ఎన్నికల ఆపరేటర్ అనుపమ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు.



సంగంలో. ..



సోమశిల: తహసీల్దార్ కార్యాలయంలో..



మర్రిపాడులో..



అల్లూరులో...



సీతారామపురంలో..



ఉదయగిరిలోని డిగ్రీ కళాశాలలో..



వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో..



చేజర్లలో..



దుత్తలూరులో..



ఏఎస్‌పేటలో..